# నెత్తుటి కన్నా చిక్కనిది

గంట నుంచీ సాగిన నిరీక్షణ బుడగలా పేలిపోయింది. ఆశకు చుక్కపెడుతూ గడప ముందునుంచీ వెళ్ళిపోయాడు పోస్ట్‌మెన్. ఐదవతేదీ! ఇవ్వాల్టికి పదేళ్ళు! సాగుతున్న ఎదురుచూపు. ఈ రోజు కూడా ఉత్తరమేంవీ లేదు. మనిషిజాడ? అసలే లేదు. ప్రతిరోజూ, ప్రతిక్షణమూ ఇలా నిరాశనే మిగులుస్తున్నాయి.

నిట్టూరుస్తూ ఇంట్లోకి నడిచింది జానకి. మనసంతా నిస్పృహతో నిండిపోయింది.

వచ్చి ప్లాస్టిక్ నవారు మంచం మీద నడుం వాల్చింది.

వాతావరణం నిశ్శబ్దంగా వుంది.

ఈ నిశ్శబ్దం ఒక అంతరంగ ఘోష కల్లోలాన్ని సృష్టిస్తుంది. తలపుల తీరాల్ని కోసేస్తున్నది. మేధని ఆలోచనల్లో మునకలు వేయిస్తోంది.

ఇప్పుడు జానకి మనసులోని ఉద్వేగమూ అదే స్థితిలో ఉంది.

గతం పెళ్ళలు విచ్చుకున్నాయి.

–ముప్పై ఏళ్ళ క్రితం, ఒక శీతాకాలపు రాత్రి, అమ్మ పక్కన మునగదీసుకుని పడుకుని వుంది తాను. తన నడుం మీద చేయివేసి, దగ్గరకి జరిగి మురిపెంగా – 'ఈ కుందనపు బొమ్మకి మంచి సంబంధం ఖాయమయింది' అని మురిసిపోయింది అమ్మా. 'నా పెళ్ళి కింత తొందరేంవిటమ్మా? నే చదువుకుంటానే' అంది తను. అప్పటి కప్పుడు ఇంకా టెన్త్ పూర్తికాలేదు. 'పిచ్చిపిల్ల' నీకేం తెలుసమ్మా? అది తల్లిగా ఈ ప్రైవేట్ స్కూల్ ఎలిమెంటరీ టీచర్ బాధ్యతమ్మా' అని. 'నాకు నా పదిహేనవోయేటనే పెళ్ళయింది జానకీ, నీ కింకా పదిహేడు జరుగుతోంది' అని భుజం తట్టింది. ఆ మర్నాటి నుంచీ ఇరుగుపొరుగు వారంతా 'జానకి అదృష్టవంతురాలు' అన్నారు, పెళ్ళి అనివార్యం అని అర్థం చేసుకుంది తాను.

ఆ వాస్తవం అర్థమయ్యేసరికి తన కళ్ళల్లో ఆకుపచ్చని వనాలు!

రఘుపతితో పెళ్ళయింది.

అతనికి అమ్మ. ఇద్దరు చెల్లెళ్ళు - కవలలు. పెళ్ళి వ్యవహారమంతా అతని మేనమామ చూశాడు. రఘుపతి చెల్లెళ్ళు తొమ్మిది చదువుతున్నారు. వాళ్ళకంటే తాను రెండేళ్ళు పెద్ద. అయినా, ముదినాపసానిలా ముతక నేత చీరల్లోకి దిగిపోయింది!

ఆర్నెల్లు గడిచేసరికీ-

రఘుపతి మనస్తత్వమూ, స్వభావమూ, ప్రవర్తనా అర్థమయ్యాయి. అతనిది గాలి వాటు తత్వం. అమ్మ ఏదైనా చెప్తే సరే అంటాడు. ఆ రాత్రి ఆ విషయాన్ని చర్చించి, మరో విధంగా చేయొచ్చుకదా అంటే అవునవునంటాడు.

హైదరాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ చేశారు. అతని ఉద్యోగం ఏదో ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో. రైలు పెట్టెలాంటి మూడు గదుల ఇల్లు. ఇరుకు. ప్రైవసీ లేదు. చాలీ చాలని జీతం. బడ్జెట్ బతుకు. ఊహల్లో కలలు. కలల్లో ఊహలు. అన్నీ రెప్పలకింది ఆలోచనల పాతరలోనే నిల్వ ఉండేవి.

రఘుపతి ఎప్పుడేం మాట్లాడతాడో తెలీదు. ఉదయం తొమ్మిదింటికి భోజనం చేస్తూ, 'సాయంత్రం సినిమాకు పోదాం సిద్ధంగా ఉండండి' అన్న మనిషి, సైకిల్ తీసుకుని బయటకి పోతూ, పక్కకి పిల్చి 'వద్దులే జానకీ, ఇల్లు కదిలితే ఐదుగురికీ కనీసం వంద వదులుతాయ్' అంటాడు.

మధ్యతరగతి దిగలాగుడు మనస్తత్వం. దానికితోడు ఏ నిర్ణయం తీసుకోవాన్నా ఊగులాట.

అన్నీ చీకటి రాత్రులు. ముందుగదిలో కక్కుర్తిపని. ఉదయాన్న అత్తమ్మ మొహం చూడాలన్నా, ప్రత్యేకించి ఆడపడుచులతో మాట్లాడాలన్నా చచ్చే సిగ్గుగా ఉండేది. ఏదో అపరాధ భావన మనసుని తొలుస్తూ ఉండేది.

ప్రసాదం కడుపున బడ్డాడు.

నామమాత్రంగా అచ్చట్లు ముచ్చట్లు. పేరుకు జరిగిన వేడుకలన్నీ కూడా ఏడుపు మొహంతోనే. పురుటికి పంపమంటే, చర్చ... ఎడతెగని చర్చ. పాటికి పదిసార్లు మార్పు.

ముందు ఐదోనెల. ఆ తర్వాత ఏడోనెల. చివరికి తొమ్మిదోనెల.

నాలుగురోజుల్లో పుట్టింటికి ప్రయాణం. ఆ రాత్రి-

'నువ్ లేకుండా నేనుండలేను జానకీ. పురుడిక్కడే పోసుకో. డబ్బుకు ఏదో ఒకటి చేద్దాం. అంతగా అయితే మీ అమ్మనే అడుగుదాం' అని వేడికోలు. బేలతనం. చేతులు పట్టుకుని కళ్ళు చెమర్చుకోవటం. ఆ కళ్ళల్లోకి చూస్తూ ఏం సమాధానం చెప్పగలదు?

అమ్మ బలవంతాన చివరికి విజయవాడ రాగలిగింది.

ప్రసాదం పుట్టాడు. సిజేరియన్ ఆపరేషన్. అమ్మకీ డబ్బు సమస్యే. అప్పో సొప్పో చేసి అన్నీ అమర్చింది. బారసాలని మూడోనెల్లో చేసుకుంటామని ముందు కబురు. ఆ వెంటనే నెలవెళ్ళేలోపే జరగాలని భీష్మించుక్కూచోటం. ఆ కార్యక్రమం జరిగింది. వెంటనే అత్తింటికి రమ్మని కోరిక! అమ్మ ఒప్పుకోలేదు. 'పిల్లవాడి ధ్యాసలో పడి తనను పట్టించుకోవటంలేదని గునుపు, విసుగు, చిరాకు, మాటల విసుర్లు. భరించలేని పోట. మూడోనెల ప్రవేశించగానే ప్రయాణం. 'పచ్చి ఒంటితే జాగ్రత్తే. ఆపరేషన్ కూడా అయింది. వెళ్లంగానే జరిగేది నాకు తెలీదా? అటు ఇంటిపనీ ఎక్కువే జాగ్రత్త' అని అమ్మ కళ్ళనీళ్ళతో సాగనంపింది.

హైదరాబాద్‌లో అదే ఇల్లు. అదే చాకిరీ. అదే వాతావరణం. సంసారం, రాత్రయ్యే సరికీ శరీరం అలసిపోయేది నీరసం. ఆయన ముందు జీవకళ లేని నవ్వు మొహంతో బండి లాగించడం... ఫలితంగా, ఇంకా, ఇంకా... నీరసం.. డాక్టర్‌కి చూపిస్తే మందులూ, మందుల కంటే ముఖ్యంగా సంసారం గురించిన హెచ్చరికలూ, సలహా వినకపోతే ఏ పెద్దరోగమో రావచ్చని సూటిగానే చెప్పాడు.

రాత్రుళ్ళు దిగులు కళ్ళతో, అరచేతిని లాలనగా స్పర్శిస్తూ ఊరడిస్తుంటే, 'ఈ జీవితానికిది చాలు' అనిపించేది. తెల్లారగానే ఖర్చు గురించి రాద్ధాంతం. ప్రసాదం పాలడబ్బాలనుంచీ అన్నీ బరువుగా మారటం. చేస్తున్న అప్పుల గురించి చర్చ. రాత్రికి మళ్ళీ 'నీ ఆరోగ్యం గురించి ఆందోళనగా ఉంటోంది జానకీ' అని ఊరడింపు. కన్నీటిని దాచుకుని శరీర ఉష్ణోగ్రతని పెంచుకోవడం. అన్ని అస్తిత్వాలూ దేహైక్యంలో కాలిపోవటం! ఉదయాన్నే అద్దంలో మొహం చూసుకుంటే - పాతబడుతున్న పెళ్ళిఫోటోలా అనిపించేది.

ప్రసాదంకి తొమ్మిదోనెల జరుగుతోంది. నెల తప్పింది. సంతోషమో విచారమో తెలీని పరిస్థితి. అమ్మకు ఉత్తరం రాస్తే ముక్తసరిగా జవాబు రాసింది. ఆ తర్వాత తెలిసింది. అప్పటికే ఆమె ఆరోగ్యం బాగా దెబ్బతిన్నదని. నెలతిరిగేసరికే చనిపోయిందామె. అత్తమ్మా, ఆయనా, తనూ ప్రసాదంతో వెళ్ళి కర్మాంతరాలయ్యాయనిపించి వచ్చారు.

– తలుపు తోసిన శబ్దానికి ఉలిక్కిపడి చూసింది జానకి.

పిల్లి! కసిరింది. వెనక్కి పరిగెత్తిందది. దాన్ని తప్పుకుంటూ లోపలికొచ్చింది సీతారావమ్మ. ఆమె అదే కాంపౌండ్‌లో వేరే షెడ్‌లో ఉంటుంది. జానకికి తల్లీ తోడుగా నిలిచిన మనిషి ఆత్మీయతా, అంతఃకరణా వున్న పెద్దావిడ. పిల్లాజెల్లా లేరు. పాత గుడ్డలకి స్టీలు సామాన్లు అమ్ముతుంది. దాన్తో ఆ ఒక్క పొట్టా గడుస్తోంది.

జానకి లేచి కూజాలోని మంచినీళ్ళు తీసుకుని తాగి కూచుంది. 'అన్నం తినలేదుటమ్మా ఇంకా' అడిగింది సీతారావమ్మ. జానకి టైమ్ చూసింది. ఒంటి గంటన్నరయింది.

'లేదు, నీదయిందా పిన్నీ?'

'ఆ... అయింది' అని 'రఘుపతిని శ్రీశైలంలో చూశానని చెప్తున్నాడు ఆ కేటరింగ్ సుబ్బారావ్. ఏదో సత్రం దగ్గర కనపడ్డాడంట. గడ్డాలూ మీసాలూ పెంచుకుని సన్యాసిలావున్నాట్ట. తెలిసిన మనిషేగా, ఈయన్ని చూసి మొహం చాటు చేసుకుని జనంలోకి దూరేడంట' చెప్పింది.

కళ్ళు విచ్చుకుని విన్నది జానకి. భర్త గురించిన ఏ కబురు విన్నా జానకికి ప్రాణం లేచొచ్చినట్టయింది.

చీకట్లో మిణుగురు తరహా వార్తలు ఇవన్నీ. అయినా రఘుపతి గురించిన కబుర్లు ఎన్ని విన్నా, విసుగురాదామెకి. ఎప్పటికప్పుడు 'ఏమో – వస్తాడేమో' అనే అనుకుంటే వుంటుందామె మనసు. అందుకే ఈ నిరీక్షణ. అందుకే రోజూ ఈ ఎదురుచూపు.

రఘుపతి వస్తాడేమోననే అలుపులేని ఆశ. దానితోపాటు ఏనాటికైనా ప్రసాదమూ తిరిగి వస్తాడనే నమ్మకం. చీకటి ముద్ద లాంఇఅనుమానంలో చిరుదివ్వె.

మంచం మీంచి లేచింది జానకి. 'ఏమోలే పిన్నీ, నిజంగానే ఏ బైరాగుల్లోనన్నా

కలిసిపోయాడేమో పోనీ' అని 'ఆయన నెట్టా పోతాయేంగానీ, వీడీ ప్రసాదంగాడు వాడికేమొచ్చిపోయె– పిన్నీ' అంటుండగానే, జానకికి దుఃఖం పొంగుకొచ్చింది. కన్నీళ్ళు ఆగలేదు.

సీతారావమ్మకీ బాధకలిగింది. 'పదేళ్ళ నుంచీ సాగుతున్నదేగా సర్లే. లేచి అన్నం తిను'.

పక్కకి కదిలి గోడవారగా కూచుంది జానకి. మూలనున్న కంచం తీసుకుని గిన్నెలోని అన్నం పెట్టుకుంది. కూరా పచ్చడీ వేసుకుని అన్నం మెదుపుతూ, 'ఏకాకి బతుకైపోయింది. అందరూ వుండి ఎవ్వరూలేని దాన్ని చేసి పోయారు ఖర్మ. గ్రహచార మిట్టా వుంది ఏం చేస్తాం' అన్నది.

జానకి భోజనం చేస్తున్నంతసేపూ లోకాభిరామాయణమేంతో చెబుతూనే వున్నది. సీతారావమ్మ. 'ఆయన పొయ్యాడంటే ఏ భయమో పీడించి పొయ్యాడన్నారు సరే. వీడీ ప్రసాదంకేమొచ్చె. అసలేమయ్యాడో అంతుచిక్కకపోయె. పోలీసులూ, కేసులూ, విచారణలూ, అన్నీ వృథాపోయె.'

జానకికి ముద్దగొంతు దిగలేదు. కొడుకు స్ఫురణకొచ్చాడు. కళ్ళనీళ్ళుతిరిగినై.

సీతారావమ్మకి పరిస్థితి అర్థమైంది. 'పొరపాటయింది జానకి. గిన్నెలు సర్దుకుని మంచం మీద వాలింది. గోడకేసి తిరిగి పడుకుంటే, వర్తమానాన్ని ఓడిస్తూ గతం చొచ్చుకొచ్చింది.

❖ ❖ ❖

ప్రసాదం పుట్టిన తర్వాత వరుసగా మూడుసార్లు కడుపు పోయింది తనకు. రోగాలూ, రొస్టులూ, ఆర్థికబాధలూ..

కాలం గడుస్తోంది.

ఉన్నట్టుండి హఠాత్తుగా రెండురోజులు వాంతులూ, బేదులూ అయి –చనిపోయింది అత్తమ్మ. ఆమె అన్న వచ్చి, రఘుపతి పరిస్థితిని చూసి, ఆడ పిల్లలిద్దర్నీ తనతో తీసుకుపోయాడు.

తమ నెత్తిన పాలు పోసినట్లయింది. ఒక బాధ్యత తీరింది. ఒక అధ్యాయం ముగిసింది. ఊపిరి పీల్చుకున్నారు.

ఆ తర్వాత క్రమక్రమంగా రఘుపతి ప్రవర్తనలో విపరీతమైన మార్పు. ఎప్పుడూ బిజీ. ఉన్నకొద్దిసేపూ ఇంట్లో పోరు. లేదా పూర్తిగా పరధ్యానం. మౌనం. తనలో తానే మాట్లాడుకోవటం. ఏవేవో కాగితాలూ, పేపర్లూ చూస్తూ కూర్చోవటం. లెక్కలు వేసుకుంటూ కూర్చోవటం. ఆఫీసంటే అశ్రద్ధ. వెళ్తే వెళ్ళటం లేదంటే లేదు. వెళ్ళినా ఏదో టైముకి వచ్చేయటం

తాను గ్రుడ్లనీరు గుడ్డకుక్కుకుని ప్రశ్నార్థకంగా చూస్తే 'నీకివన్నీ తెలీవులే. మన దశ తిరగబోతోంది. ఈ దరిద్రం తీరబోతోంది' అని ఏదేదో మాట్లాడేవాడు.

విషయాన్ని తెలుసుకోవాలని నిగ్గదీస్తే 'రేపీ పాటికి నేను లక్షాధికారినైపోతే కళ్ళు తేలేయకు. నువ్ నమ్మలేనంత ధనం తెస్తాచూడు' అనేవాడు.

ఆశో, అత్యాశో, దురాశో...? తనకైతే అంతా అయోమయంగా ఉండేది. ఆ తీపి ముచ్చట్లు ఏ వాస్తవానందాన్నీ యివ్వక ముందే, ఆ ఇచ్చకాలు ఏ ఆకారాన్నీ సంతరించుకోకముందే విషయం తెలిసింది. రఘుపతి షేర్ మార్కెట్ వ్యామోహంలో పడ్డాడని. అదే వ్యసనమైంది. దానికి తోడు గుర్రప్పందాలూ ఆకర్షించినై. ఈ రెంటికీ అనుబంధంగా తాగుడు అబ్బింది. వీటన్నిటి మధ్యా అబద్ధాలు. ఇంట్లో అవసరాలకి కటకట. పైసలడిగితే విసుగు, చిరాకు, కోపం, తిట్లూ.... చెయి చేసుకోవటం. జ. ప్రసాదంకి చదువూ సంధ్యాలేదు. తండ్రిని ఎగర్దించి పోట్లాడే వాడు. ఇద్దరికీ పామూ ముంగిస తంతు. ఒకరి మీద ఒకరు బూతుల పర్వం. నువ్వెంతంటే నువ్వెంత అని చేతులెత్తుకోవటం.

రఘుపతికి అసలు ఉద్యోగం వున్నదో లేదో ననే అనుమానం పీడిస్తూ వుండేది తనకు. ఎక్కడెక్కడో తిరుగుడు. ఏ అర్థరాత్రో అపరాత్రో ఇంటికి రావడం. ఏమడిగినా తిట్లూ... చేయి చేసుకోవడం. 'ఏముందే ఇక్కడ? ఎందుకు రావాలి. ఇంటికి? స్మశానం బెటర్. నిన్ను చూస్తేనేమో... ఛీ... సంసారం మీదే విరక్తి కలుగుతుంది. టీబీ పేషెంట్‌లా ఎండుములక్కొమ్మల్లా ... ఆ అవతారం చూడు' అంటూ కుళ్ళ బొడవటం. ఈసడింపు.

– దసరా రోజులు.

ఆవేళ అష్టమి. అప్పటికి వారమైంది. రఘుపతి ఇంటికొచ్చి. అయ్యవారి నట్టిల్లులా వుంది ఇల్లు. పొయ్యిలో పిల్లి లేచే పరిస్థితి లేదు. ప్రసాదం ఎక్కడెక్కడో తిరిగొస్తున్నాడు. వాడికి చెడు స్నేహాలు అబ్బినై.

రఘుపతి ఆఫీస్‌కి వెళ్ళింది తాను.

చాలావిషయాలు తెలిసినై. గుండె బిగదీసింది. ఆఫీస్‌లోనూ యితర మిత్రుల దగ్గరా చెయ్యని అప్పులేదు. పదిరోజుల్నుంచీ అయిపులేదు. వాళ్ళూ ఎదురు చూస్తున్నారు. ఇంటి అడ్రస్ తెలీక పోవటాన ఇంటిమీదికి రాలేదు వాళ్ళంతా.

ప్రాణనాడి తెగినట్లయింది. మనసు గిలగిల్లాడింది. భయం, నిరాశ, దుఃఖం దాడిచేశాయి. ఏం చేయాలి? ఇంటి అవసరాలు - ముఖ్యంగా ఇంటి అద్దె భూతాల్లా కళ్ళముందు నిలిచాయి.

రోజులు గడుస్తున్నకొద్దీ విషయాలు నలుగురికీ తెలిశాయి.

ఒకరోజు రఘుపతి మేనమామ - మేనకోడళ్ళని తీసుకుని వచ్చాడు. వాళ్ళ మేనల్లుడు ఇల్లు వదిలిపోవడానికి తానే కారణమంటూ దుర్భాషలాడాడు. రఘుపతి చెల్లెళ్ళు తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టారు. రాత్రి పొద్దుపోయేవరకూ సాగింది రాద్ధాంతం. ఇంటా బయటా చీకట్లు కమ్ముకున్నాయి. మర్యాదకి భోంచేసి పొమ్మన్నది తను. దానికీ వెటకారాలూ, ఈసడింపులూ దక్కినై. ప్రసాదం అప్పుడే వచ్చాడు. వాడితోనే అదే ధోరణిలో మాట్లాడారు ముగ్గురూ. వాడూ నాలుగు అంటించాడు. గింజుకున్నారు. లేచి విసురుగా వెళ్ళిపోయారు. ఆ తర్వాత అన్నాడు ప్రసాదం. 'వాడు చేసిన వెధవ పనికి మనం సంజాయిషీ చెప్పాలా- వీళ్లకి?' అని. కోపంతో వాడి కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నై. అయినా, తండ్రిని వాడూ వీడూ అని వెధవ పనీ గిధవ పనీ అని నిందించడం బాధ కలిగించింది తనకి. ఎంతో అవమానం కలిగినట్లనిపించింది. కోపమొచ్చింది.

'ఇట్లాంటి విషయాల్లో కొంచెం నోరుని అదుపులో వుంచుకుని మాట్లాడాలి. అయినా, నువ్వో గొప్ప అరిందావనుకుంటున్నావా? ఇంట్లో నుంచీ వెళ్ళి పోయినా - ఆయన నీ తండ్రిరా' అని కసురుకుంది. మందలింపుగా అవీ ఇవీ చెప్పింది. ఎంతలో ఉండాలో అంతలో వుండమన్నది.

ప్రసాదం ముఖం ఎర్రబడింది. ఉక్రోషం పొంగింది. కాళ్ళు తటపటలాడిస్తూ విసురుగా బయటికి వెళ్ళి పోయాడు.

అంతే.... ఆ పోవటం పోవటం అయిపు లేకుండా పోయాడు. రోజులు జరిగినై. వారాలు గడిచినై. నెల తిరిగింది. పోలీస్ కంప్లెయింట్‌లూ, విచారణలూ ఏ ఫలితాన్నీ యివ్వలేదు.

ఉన్న సూత్రం గొలుసునీ, వెండి పళ్ళేన్నీ తెగనమ్మి, ఇంటి అద్దెనీ, ఇతర చిల్లర మల్లర అప్పుల్నీ తీర్చేసి, విజయవాడకి మకాం మార్చేసింది.

అప్పట్నుంచీ – తన ఒక్కపూట గడవడానికి చెయ్యని పనిలేదు. అగ్గిపెట్టెల ఫ్యాక్టరీలో పుల్లలు కూర్చింది. విస్తర్లు కుట్టి అమ్మింది. స్వీట్‌షాప్ వాళ్ళకి చేగోడీలు చుట్టి యిచ్చింది. మిషన్ కుడుతోందిప్పుడు. అదే జీవనాధారమైంది. అమ్మ మిగిల్చి పోయిన స్థలంలో –సీతారావమ్మ షెడ్ వేసుకుంటానంటే సరేనంది. ఆమె ఇచ్చే అద్దె చిల్లర ఖర్చులకొస్తుంది.

భుక్తి గడుస్తోంది.

భౌతికమైన అవసరాలు గడుస్తున్నై. కాని మానసికమైన వ్యథ? మనో వ్యాధి?

'వాడు నా బిడ్డ... ఎవరు చెప్తారు వాడి ఆచూకీ, ఎవరు తీసుకురాగలరు వాణ్ణి నా ఎదుటికి? అనిపిస్తుంది.

మనసులో ఆశ కళ్ళల్లో ఎదురుచూపు!

–ప్రహరీగోడ అవతల. ఇంటి గేటు ముందర ఏదో కలకలంగా ఉంటే ప్రస్తుతంలోకొచ్చింది జానకి. లేచివెళ్ళి చూసింది. ఏ ప్రాంతం నుంచో వచ్చిన కోయదొర ఎవరో – ఒక చిన్న గుంపుకి చేతులు చూసి జోశ్యం చెపుతుఅన్నడు.

'ఈ బాబుకి ఆడపిల్ల సమస్య కాబోతోంది. ఏం నాయనా కూతురు కాలేజీలో చదువుకుంటోంది కదా?' ఎవర్నో ప్రశ్నిస్తున్నాడు. ఆ 'చేయి'యజమాని బుర్రని గిరగిరా తిప్పుతున్నాడు. ఔనౌనన్నట్టు! ముందు జరుగుతున్న వ్యవహారానికి వెనకవున్న వాళ్ళు చేరువ కావాలని జరుగుతున్నారు. తోసుకుంటున్నారు.

కోయదొర చూపు జానకి మీద పడింది. 'ఓయమ్మ నీ విచారం కడకొచ్చింది. రేపు మాపుల్లో నీ కోరిక తీరనుంది తల్లి. నెలకొస్తమల్లా. ఆ నాటికి ఈ కొండదొరకి పంచెబెట్టు మాయమ్మ' అని దూరం నుంచే అన్నాడు. జానకి ఉలిక్కిపడింది. చేయి చూడకుండా, మొహం చూసి చెప్తున్నాడు. ఏమో–ఏం జరగనుందో అనిపించింది.

మరో అర్ధగంటసేపు జరిగిందా వినోద ప్రదర్శనం. ఆ తర్వాత నిదానంగా గుంపు చెల్లాచెదరయింది. అందరూ నిష్క్రమించారు. జానకికి మనసులో ఎక్కడో సన్నని ఆశారేఖ!

ఆ సాయంత్రమూ, రాత్రీ కూడా ఆమెకు మనసు మనసులో లేకుండా పోయింది. పరిపరివిధాల ఆలోచనలు ముసురుకున్నై. సీతారావమ్మని పక్కన పడుకోబెట్టుకుని పాతకబుర్లని చెబుతూనే రాత్రంగా గడిపింది.

తెల్లవారింది. రోజంతా యాంత్రికంగా గడిచింది. సాయంత్రమైంది. లోవాకిట్లో చెత్త ఊడుస్తోంది జానకి. అదిగో అప్పుడు –

గేటు దాటి లోపలికొచ్చాడు ప్రసాదం. పక్కన వో ముప్పై ఏళ్ళయువతి. ఆమె చేయి పట్టుకుని నాలుగేళ్ల పిల్ల!

నోటమాటరాక నిశ్చేష్ట అయింది జానకి. సంభ్రమం, ఆశ్చర్యం, పొరక్కట్ట చేయిజారి కిందపడింది. అడుగు లోపలికి పడింది. వచ్చినవాళ్లు ఆమెని అనుసరించారు.

నూటికి కోటికి జరిగే వింత సంగతే అయింది. ఈ భౌతిక వాస్తవం తల్లి కళ్ళల్లో మెదులుతున్న శతకోటి ప్రశ్నలకి ఒక్కటే సమాధానం చెప్పాడు ప్రసాదం.

'ఈమె రాణి. భర్త పోయాడు. ఆ పిల్ల చిన్ని ఆమె పిల్లే. రాణీ నేనూ పెళ్ళి చేసుకున్నాం.'

జానకి ఏమీ అనలేదు. ఆమె దుఃఖం, అనుభవం ఆమెని ఏమీ అననీయలేదు రాత్రి గడిచింది.

మర్నాడు – ఉదయాన్నే రఘుపతీ ఆ గడపలో నిలబడ్డాడు! నిరుత్తరంగా, నిశ్చేష్టంగా నిలబడి పోయింది జానకి.

బతుక్కి లయ, క్రమం, పద్ధతీ, ప్రేరణా ఏ ముంటాయి కనుక?' కొండదొర మాట గుర్తుకొచ్చింది జానకికి.

– నెల తిరిగేసరికీ, భర్త రాకలోని ఆంతర్యం, కొడుకు రాకలోని అవసరం – వివరంగానే తెలుసొచ్చాయి జానకికి. ఇంటినీ, స్థలాన్నీ బిల్డర్‌కివ్వాలనే తండ్రీ కొడుకుల ఆలోచనమీద – ఇప్పుడా ఇంట్లో రచ్చ జరుగుతోంది! కోయదొర జోశ్యం, జానకి నిరీక్షణా– రెండూ ఫలించాయి! భార్యగా తల్లిగా మిగిలిపోవటమా? స్త్రీగా నిలబడటమా? ఏది కర్తవ్యం?'

జానకి గట్టిగానే ఆలోచిస్తుందిప్పుడు!

–చినుకు మాసపత్రిక, అక్టోబర్ 23, 2011